సాక్షి
ములుగు
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



ట్రస్టు బోర్డు ఏర్పాటయ్యేనా?

సరస్వతి నది పుష్కరాలకు 27 రోజుల సమయం ఉంది. ఇప్పటి వరకు కాళేశ్వరం ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుచేయలేదు. - IIలో



వేసవి ప్రత్యేక రైళ్లు

వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - IIలో

గరిష్టం/కనిష్టం
$39.3^0/28.4^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో ఉక్కబోతగా ఉంటుంది.

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లు

పార్టీలకతీతంగా ప్రతీ నిరుపేదకు లబ్ధి

- సామాన్య ప్రజల కోసమే 'భూ భారతి'
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- భూ భారతి పైలట్ మండలంలో రెవెన్యూ సదస్సు
- హాజరైన మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ తదితరులు



రశీదును అందజేస్తున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క



అవగాహన సదస్సుకు హాజరైన ప్రజలు

వెంకటాపురం(ఎం)/ములుగు: అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఈ నెలాఖరులోగా ప్రతీ గ్రామంలో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ భారతి పైలట్ మండలంగా ఎంపిక చేసిన వెంకటాపురం(ఎం) మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖలతో కలిసి ఆయన హాజరయ్యారు. పలువురు రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ పేరు వింటేనే ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులు ఉన్నారని, ఈ ప్రాంత సమస్యలపై ప్రత్యేక కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో రైతు సదస్సులు ఎప్పుడు పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి -2020 చట్టాన్ని బంగాళాఖాతంలో వేసి సామాన్య ప్రజల కోసం భూ భారతి-2025 చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ చట్టం ద్వారా కాస్తులో ఉన్న ప్రతీ రైతుకు పట్టా పాస్ బుక్కులు అందజేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకొని ఉన్న ఆబాదీ భూములకు డాక్యుమెంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలో పండుగ వాతావరణం

భూ భారతి చట్టంతో రాష్ట్రంలో పండుగ వాతావరణం మొదలైందని, ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు అన్నారు. జిల్లా కలెక్టర్లు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని చట్టంపై రైతులకు అవగాహన పెంచుతూ భూ సమస్యలను తెలుసుకుంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రులను, ఎంపీ, ఎమ్మెల్యేలను సీతక్క శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం కొంతమంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులను మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్.నాగరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

746 దరఖాస్తులు స్వీకరణ

మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకునేందుకు 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు. వివిధ భూ సమస్యలపై 746 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

రైతును రాజు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ : మంత్రి కొండా సురేఖ



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరంతరం రైతుల గురించి ఆలోచించి రైతును రాజుగా చేశారని మంత్రి కొండా సురేఖ అన్నారు. వైఎస్సార్ హయాంలో రైతు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సబ్సిడీపై విత్తనాలు, పంటకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం ద్వారా పేదలకు, దళితులకు భూములు పంచారని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు న్యాయం చేసేందుకే భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చారన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా అధికారులు సేవలందించాలని, తప్పు చేసే వారిపై చర్యలు ఉంటాయన్నారు.

భూమికి రైతుకు ఉన్న బంధమే తల్లీబిడ్డ సంబంధం: మంత్రి ధనసరి సీతక్క



తల్లీబిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో భూమికి రైతుకు అలాంటి బంధం ఉంటుందని, గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతుల ఆత్మహత్యలకు కారకులయ్యారని మంత్రి సీతక్క అన్నారు. నేడు రైతుల సమస్యలను పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. నూతన చట్టాన్ని అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, వ్యాపారాలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధరణితో గోసపడ్డాం..

ధరణి చట్టంతో గోసపడ్డాం.. చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయాం. భూములున్న వారికి పట్టాలు ఇవ్వలేదు. ధరణిలో భూములు ఎక్కించే అవకాశాలు లేవని రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంతోనైనా మాకు న్యాయం జరగాలని పలువురు రైతులు అభిప్రాయ పడ్డారు.

- ఎన్నో ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నాం. ధరణి రాకముందు రికార్డుల్లో ఉంది. ధరణి చట్టం వచ్చాక మా భూమిని తొలగించారని వెంకటాపురం (ఎం)కు చెందిన తుత్తురు పర్వతాలు అన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగిన రికార్డులో ఎక్కలేదని వాపోయారు.

పట్టా లేకపోవడంతో పథకాలు అందలేదు..



భూములకు పట్టా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందలేదు. పట్టా చేయాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు తిరిగినా..పట్టా కాలేదు. భర్త చనిపోయాడు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భూభారతిలోనైనా పట్టా చేసి ఆదుకోవాలి.

- తైనేని సరోజన, వెంకటాపురం(ఎం)

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో టెన్త్‌లో 2,679 మంది
- ఇంటర్‌లో 4,707 మంది విద్యార్థులు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నారు. అందుకు హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరు జిల్లాల్లో మొత్తం టెన్త్ విద్యార్థులు 2,679 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 4,707 మంది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 34 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 35 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. 9 ఫ్లయింగ్ స్క్వాడ్ల బృందాలు, 35 సిట్టింగ్ స్క్వాడ్ల బృందాలను ఏర్పాటు చేశారు. 418 మంది ఇన్విజిలేటర్లుగా విధులను నిర్వర్తించనున్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ప్రత్యేక సబ్జెక్టులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ అనగాని సదానందం శుక్రవారం తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 80084 03631, 93460 20003 సంప్రదించాలని వారు సూచించారు.

పనుల పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే15 నుంచి 26 వరకు జరుగు సరస్వతి నది పుష్కరాలకు సంబంధించిన రూ.కోటితో చేపట్టిన ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్‌ల ప్రగతిని ఆ శాఖ సీఈ రాజుచౌహాన్ పరిశీలించారు. శుక్రవారం ఆయన కాళేశ్వరంలో జరుగుతున్న విద్యుత్ పనులను పరిశీలించారు. సలహాలు, సూచనలు అందజేశారు. పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ మల్హార్ నాయక్, డీఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

న్యూస్‌రీల్

యాసంగి ధాన్యం దిగుమతి చేసుకోం..

- మంత్రి పొంగులేటికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వినతి

ములుగు రూరల్: యాసంగి సాగులో వరి ధాన్యం దిగుమతి చేసుకోలేమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాదం ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సాగు ధాన్యం కేవలం బాయిల్డ్ బియ్యం మాత్రమే అవుతాయని, రారైస్ అయినా అవి తినడానికి వీలుగా ఉండవన్నారు. స్పందించిన మంత్రి కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పల్లెపాటి సమ్మిరెడ్డి, అనిల్, హరినాథ్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ సమస్యలపై పోరాటం



వెంకటాపురం(కె): ఆదివాసీ సమస్యలపై యువత అలుపెరుగని పోరాటం చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూనం రాంచందర్ అన్నారు. శుక్రవారం టీబీఏఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆదివాసీ సమస్యలు, చట్టాలు, హక్కులపై పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసం లక్ష్మయ్య, పూనెం మునేశ్వరరావు, తాటి లక్ష్మణ్, పొడెం రాకేష్, ఇరుప లక్ష్మి, స్వరూప, ఉషారాణి, సుశీల, నాగరాజు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



వాజేడు: మే 5న నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ కోరారు. మండల పరిధిలోని పేరూరులో శుక్రవారం ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను కాపాడుతామని చెబుతూనే గిరిజనేతరులకు హక్కులు కల్పించడానికి కుట్ర చేస్తుందన్నారు. చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఆదివాసీ ప్రజలు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నర్సింహరావు, సుధాకర్, మనోజ్, కృష్ణబాబు, రాంబాబు, నర్సింహరావు, అర్జున్ తదితరులు ఉన్నారు.

భద్రకాళి సన్నిధిలో ఐటీడీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని శుక్రవారం ఐటీడీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ బానోత్ శరత్‌నాయక్ కుటుంబసమేతంగా సందర్శించారు. వారిని ఆలయ అధికారులు స్వాగతించారు. ముందుగా వారు ఆదిశంకరులను, వల్లభగణపతిని దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం శరత్ నాయక్ దంపతులకు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

నేటినుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

కేయూ క్యాంపస్: కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (కుక్టా) అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే యూనివర్సిటీ అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చామని పేర్కొన్నారు. నేడు పరిపాలనాభవనం వద్ద నిరసన దీక్షలు చేపట్టాలని యోచిస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం జారీచేసిన 21 జీఓను వ్యతిరేకిస్తున్నామని, దీనిలో సవరణలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాకే మిగతా పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ



డైరీని ఆవిష్కరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

మంగపేట: రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అర్చక ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 (ఉగాది నుంచి ఉగాది) సంవత్సర డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లాలని ఆలయాలు పచ్చదనం పరిశుభ్రతతో ఉండాలనే ఆకాంక్షతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క పనిచేస్తున్నారన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగుల సమస్యలపై త్వరలో సదస్సు నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని, ఆ సదస్సులో అర్చక ఉద్యోగుల దూపదీప నైవేద్యం, అర్చకుల సమస్యలు పరిష్కారం కాబోతున్నాయన్నారు. ముక్తేశ్వర స్వామి సన్నిధిలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే త్రివేణి సంఘమములోని అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలను ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన తరహాలో వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ ప్రత్యేక చొరవతో కోట్లాది మంది హిందువులు పుణ్య స్నానాలు చేయాలనే సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులు తరలివచ్చి పవిత్రమైన పుణ్య స్నానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అర్చక జేఏసీ గౌరవ అధ్యక్షుడు ముక్కామల రాజశేఖర్ శర్మ, ఆలయ అర్చకులు కారంపుడి పవన్‌కుమార్, ఈశ్వర్‌చంద్, సిబ్బంది సుధీర్, అజయ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయంలో అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, రామప్ప అర్చకులు కోమళ్లపల్లి హరీష్‌శర్మ, మోహనపు ఉమాశంకర్‌లతో కలిసి ఉగాది టు ఉగాది డైరీని ఆవిష్కరించారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ఏసుక్రీస్తు శిలువను మోస్తున్న క్రైస్తవుడు

మంగపేట: జిల్లాలో పలు గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలని పలువురు పాస్టర్లు చర్చిల్లో సందేశమిచ్చారు. మంగపేట మండలం కమలాపురం, ఆయా గ్రామాల్లోని ఆర్ఎంసీ, సీఎస్ఐ, సియోను, అగాపే, అపోస్తలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసుప్రభు భక్తి గీతాలను ఆలపించారు. కమలాపురంలో రోమన్ కేథలిక్ చర్చి బృందం క్రీస్తు శిలువ యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆదాం, విజయరాజు, దేవరాజు, కృపానిధి భక్తులు పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ సూర్యనారాయణ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాకు కేటాయించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్‌వీ సూర్యనారాయణ తెలిపారు. భూపాలపల్లి ఏరియాను శుక్రవారం సందర్శించి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డితో కలిసి అన్ని గనుల అధికారులతో ఉత్పత్తి ఉత్పాదకతలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. రక్షణ సూత్రాలను పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పక సాధించాలని ఆదేశించారు. రవాణాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి బొగ్గు రవాణ లక్ష్యం కూడా తప్పక సాధించాలని అధికారులను కోరారు. ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన భూ సేకరణ, మట్టి వెలికితీయడంలో ఎదురయ్యే ఇబ్బందులు తక్షణమే పరిష్కరించుకొని ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. కార్మికులకు వైద్య సదుపాయం, ఇతర సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఓసీ-2 పీఓ వెంకటరామారెడ్డి, ఎస్ఓటు జీఎం కవీంద్ర, ఓసీ-3 పీఓ భిక్షమయ్య పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగజ్యోతి, నాయకులు

ములుగు: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచే వారిని గుండెల్లో పెట్టుకుంటామన్నారు. అలాగే రవళి కుటుంబానికి న్యాయం చేసి వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ములుగు మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పోరిక విజయరాంనాయక్, రాసమల్ల సురేందర్, కోగిల మహేష్, పాలెపు శ్రీను, చెన్న విజయ్ పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న గీత కార్మికులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కాటాపూర్‌లో కల్లుగీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్ ఆధ్వర్యంలో గీత కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఎర్రగట్టు మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గీతకార్మికులను సాంఘిక బహిష్కరణ చేసి, శ్రీరామనవమి పండుగ రోజు గుడిలోకి వచ్చిన మహిళలను అవమానపరచడంతోపాటు, ఈతచెట్లను ధ్వంసం చేసిన వీడీసీ సభ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రంగు సత్యనారాయణ, రంగు లాలయ్య, గండు సదానందం, సురేష్, రంగు రాజు, లింగాల వెంకన్న, సురేష్, మార్క ప్రణయ్, గట్టు వసంత్, కక్కెర్ల వెంకటేష్, గీత కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ గీతాలాపనలో రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేశ్‌బాబు



కుటుంబ సమస్యలు కుల పెద్దలే పరిష్కరించాలి

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆయా జిల్లాల న్యాయ సేవ సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ఆడిటోరియంలో నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ కుటుంబ సమస్యలను కులపెద్దలే పరిష్కరించాలన్నారు. - వరంగల్ లీగల్

- వివరాలు IIలో

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి

- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన
- బాధ్యులపై చర్య తీసుకుంటామన్న మంత్రి సీతక్క



మృతి చెందిన శిశువు



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ములుగు: వైద్యుల నిర్లక్ష్యంతో గర్భంలో శిశువు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండారుపల్లికి చెందిన బిల్ల రవళి గురువారం ప్రసవం కోసం ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. మొదట వైద్యులు పరీక్షలు చేసి ఆపరేషన్ చేస్తామన్నారు. తదనంతరం సాధారణ ప్రసవానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వైద్యులు ప్రసవానికి ప్రయత్నించే సమయంలో గర్భంలోనే మగ శిశువు మృతిచెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, బంధువులు జాతీయరహదారిపై ఆందోళన చేసే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో రెవెన్యూ సదస్సుకు హాజరుకావడానికి వచ్చిన మంత్రులు ఈ రహదారి గుండా వెంటాపురం(ఎం) మండలకేంద్రానికి వెళ్లాల్సి ఉంది. దీంతో అప్రమత్తమయిన పోలీసులు ఆందోళన కార్యక్రమాన్ని నిలువరించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క బాధ్యులపై చర్య తీసుకుంటామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బాలింత పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు అన్నారు. స్థానికంగా డెలివరీ కాకపోతే వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినా వైద్యులు పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు.

వేముల శంకర్‌కు డాక్టరేట్

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఐటీ మాస్టర్ స్కిల్ హబ్ డైరెక్టర్, వలంటరీ ఆర్గనైజేషన్ స్థాపకుడు వి.శంకర్‌కు స్ఫూర్తి సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ రీసెర్చ్ యూనివర్సిటీ (యూఎస్ఏ) వారు అంతర్జాతీయ డాక్టరేట్ అవార్డును శుక్రవారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో అవార్డును అందజేశారు.

ప్రపంచ వారసత్వ సంపదను కాపాడుకోవాలి

- కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు



పర్యాటకులతో మాట్లాడుతున్న పాండురంగారావు

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు పిలుపునిచ్చారు. వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకుని శుక్రవారం రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ సంపద ప్రాముఖ్యతను తెలియజేస్తూ పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాండురంగారావు మాట్లాడారు. ప్రపంచ పటంలో రామప్పను తీసుకెళ్లేందుకు అహర్నిషలు కృషి చేశామన్నారు. వెంకటాపురం మండల కేంద్రం శివారులో సింగరేణి చేపట్టే ఓపెన్‌కాస్ట్ గనితో రామప్ప ఆలయానికి, సరస్సుకు ముప్పు ఉందన్నారు. ఓపెన్‌కాస్ట్ గనితో భూమిలోని పొరల కదలికల వల్ల ఆలయం కూలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే ఓపెన్‌కాస్ట్ గని అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్‌రావు, ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్ఆర్‌సీ రెడ్డి, ప్రొఫెసర్లు దేవప్రతాప్, సాంబయ్య, గణపతి, సేవా టూరిజం కల్చరల్ సొసైటీ ఫౌండర్ కుసుమ సూర్యకిరణ్, రామప్ప పరిరక్షణ సమితి కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, గైడ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

డీజిల్ దొంగల అరెస్ట్



డీజిల్ దొంగల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పరకాల: కొంతకాలంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లలో అర్ధరాత్రి వేళల్లో డీజిల్ కొట్టించుకుని డబ్బులివ్వకుండా పారిపోతున్న ముఠాను పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐ క్రాంతికుమార్ వివరాలు వెల్లడించారు. ముగ్గురు యువకులు ఉమ్మడి జిల్లాలోని రాయపర్తి, జఫర్‌గఢ్ పెట్రోలు బంక్‌లతోపాటు పరకాల పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు కియా సైరీస్ కారులో గత నెల 25వ తేదీన వేర్వేరు సమయాల్లో వచ్చారు. రెండు క్యాన్‌లలో డీజిల్ పోయించుకొని ఫోన్ పే చేస్తామంటూ డబ్బులు ఇవ్వకుండానే పారిపోయారు. బంక్ యజమాని ఫిర్యాదు మేరకు పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు. గాలింపు చేపట్టగా దోపిడీ కోసం వినియోగించిన కారుతోపాటు ముగ్గురు యువకులు పట్టుపడ్డారు. పట్టుబడిన నిందితుల్లో వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన ఏనుగుల రంజిత్, హనుమకొండ జిల్లా ఆత్మకూరుకు చెందిన రేవూరి నవీన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలానికి చెందిన కోడిరెక్క భరత్ చంద్ర ఉన్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. నిందితులనుంచి కారుతోపాటు 4 సెల్‌ఫోన్‌లు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో పరకాల ఎస్‌ఐ శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం ట్రస్టు బోర్డు ఏర్పాటయ్యేనా?

ఆశావహుల ఎదురుచూపులు | **సరస్వతీ పుష్కరాలకు ముందు ఏర్పాటు చేస్తే బాగుటుందని భక్తుల అభిప్రాయం**

కాళేశ్వరం: తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో కాళేశ్వరం ఒకటి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఆలయానికి ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని భక్తులతోపాటు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే కోడ్ అమల్లోకి రావడంతో నియామకాలు నిలిచాయి. కానీ మార్చి 3వ తేదీతో కోడ్ ముగిసింది. నెల రోజులకు పైగా గడిచిన ట్రస్టు బోర్డు ఏర్పాటు ఆలస్యం అవుతుండడంతో చైర్మన్, డైరెక్టర్ పదవులను ఆశిస్తున్న వారిలో ఆందోళన మొదలైంది. సరస్వతీ నది పుష్కరాలు మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించి రూ.25కోట్లు మంజూరు చేసింది. అభివృద్ధి పనులు కూడా చకచకా జరుగుతున్నాయి. కాగా, పుష్కరాలకు 27 రోజుల సమయం కూడా లేదు. అయినా ఇంతవరకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయంపై మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రెండోసారి నోటిఫికేషన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది ఆగస్టులో ట్రస్టుబోర్డు ఏర్పాటుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పుడు 20 రోజుల నిర్ణీత గడువులోగా వివిధ పదవులకు 37 వరకు దరఖాస్తులు వచ్చాయి. అంతలోనే మూడు నెలల గడువు ముగియడంతో అనివార్య కారణాలతో ఆ ఉత్తర్వులు రద్దు చేశారు. తర్వాత ఈ ఏడాది జనవరి 5న ట్రస్టుబోర్డు ఏర్పాటుకు మళ్లీ రెండోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆశావహులు 88మంది వరకు దరఖాస్తులు చేసుకున్నారు. సంవత్సరం కాలపరిమితితో 14 మంది డైరెక్టర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్‌కు దరఖాస్తులు చేసుకున్నారు.

ముమ్మర ప్రయత్నాలు!

ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ఆశావహులకు సంబంధించి పోలీసు, ఎస్‌బీ ఎంక్వైరీలు పూర్తయ్యాయి. నివేదికలు ప్రభుత్వానికి పంపించారు. మంత్రి శ్రీధర్‌బాబు సూచించిన వారికి డైరెక్టర్, చైర్మన్ పదవులు రానుండడంతో ఆయన వద్దకు నేతలు క్యూ కడుతున్నారు. కాళేశ్వరం, మహదేవపూర్, మంథని, ముత్తారం, హనుమకొండ, భూపాలపల్లి నుంచి చైర్మన్ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. గతంలో చైర్మన్ చేసిన ఒకరికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.



కాళేశ్వరంలో ఈఓ కార్యాలయ భవనం

పుష్కరాల లోపు ఏర్పాటు చేయాలంటున్న భక్తులు..

కాళేశ్వరం దేవస్థానంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ముందుగానే ట్రస్టుబోర్డు నియామకం జరుగుతుందని ఆశావహులు ఆశించి నిరాశ పడ్డారు. ఈక్రమంలో సరస్వతీ పుష్కరాలు వచ్చే నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. ఈలోపు ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసేలా నేతలు మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారపార్టీ నాయకులను కలుస్తున్నట్లు తెలిసింది. కాగా, పుష్కరాల లోపు ట్రస్టుబోర్డు నియామకం జరిగితే అభివృద్ధి పనులపై అజమాయిషీ ఉంటుందని, పుష్కరాల్లో ఏర్పాట్లపై మరింతగా దృష్టిసారిస్తారని భక్తులు పేర్కొంటున్నారు.

స్టెరాయిడ్ విక్రయిస్తున్న జిమ్ ట్రైనర్ అరెస్ట్

- పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : బాడీ బిల్డింగ్ పోటీల్లో గెలుపొందాలనే యువత కోరికను ఆసరా చేసుకుని వారికి అత్యంత ప్రమాదకర స్టెరాయిడ్ విక్రయిస్తున్న జిమ్ ట్రైనర్‌ను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి మట్టెవాడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్‌లోని డాక్టర్స్ కాలనీకి చెందిన కందకట్ల శ్రవణ్‌కుమార్ అలియాస్ కిరణ్ సుబేదారిలోని జేడీ జిమ్‌లో బాడీ బిల్డింగ్ శిక్షణ పొందుతున్నాడు. ఈ శిక్షణలో ప్రశాంత్ అనే వ్యక్తి పరిచయమై శరీర ఆకృతి త్వరగా రావాలంటే స్టెరాయిడ్ తీసుకోవాలని చెప్పి కొన్ని స్టెరాయిడ్ ఇంజక్షన్లు, టాబ్లెట్లు విక్రయించాడు. అప్పటి నుంచి శ్రవణ్ స్టెరాయిడ్ తీసుకుంటూ జిమ్ చేస్తున్నాడు. ఈ విధంగా ఐదు సంవత్సరాలుగా శ్రవణ్ స్టెరాయిడ్స్ తీసుకుంటూ ఎలాంటి లైసెన్స్ లేకుండా వైజాగ్‌కు చెందిన మణికంఠ, ఆనంద్ వద్ద ఆన్‌లైన్ ద్వారా స్టెరాయిడ్ కొనుగోలు చేస్తూ యువతకు సైతం విక్రయిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు శ్రవణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా యువతకు స్టెరాయిడ్ విక్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బు సంపాదించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో శ్రవణ్‌ను అరెస్ట్ చేసిన అతడి వద్ద నుంచి సుమారు రూ.20 వేల విలువైన స్టెరాయిడ్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. శ్రవణ్‌కు స్టెరాయిడ్ విక్రయించిన మణికంఠ, ఆనంద్, ప్రశాంత్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ వివరించారు. కాగా, స్టెరాయిడ్‌తో బీపీ పెరిగి హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని, వీటి వినియోగంతో కాలక్రమేణ మానసిక సమస్యలు ఇబ్బందులు ఎదురవుతాయని ఏసీపీ పేర్కొన్నారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సై విఠల్, తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడి వ్యక్తి మృతి

గార్ల: ఇంటి గోడకు నీరు కొడుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం పూమ్యాతండాలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల తహసీల్దార్ కార్యాలయం బజార్‌కు చెందిన లాల్‌మహ్మద్(54) పూమ్యాతండాలో నిర్మిస్తున్న ఇంటి గోడకు పైపుతో నీరు కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సంపులో పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేరు. సంపు నీరుతో నిండడంతో ఊపిరాడక చనిపోయాడు. కాగా, లాల్‌మహ్మద్ ఫిట్స్‌తో సంపులో పడి చనిపోయాడా లేదా ప్రమాదవశాత్తు పడి చనిపోయాడా అనే వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వానిది అవగాహనారాహిత్యం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎల్కతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో రాష్ట్రంలో వ్యవసాయం కుంటుపడేలా చేస్తోందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో ఈనెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో అద్భుత సభలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జన మొదలు.. నేటి రజతోత్సవ సభ వరకు ప్రజల్లో స్ఫూర్తి నింపుతున్న నేత కేసీఆర్ అన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించబోయే సభ దేశ చరిత్రలో నిలుస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందన్నారు. 10 సంవత్సరాల కాలంలో కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దితే అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లో తెలంగాణను అధోగతిపాలు చేస్తోందని విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో భూములు కొల్లగొట్టే ప్లాన్ చేశారని, ధరణి పేరు మార్చి భూ భారతి అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, ఇన్‌చార్జ్‌లు భరత్‌కుమార్‌రెడ్డి, నాగుర్ల వెంకన్న, నాయకులు ఎల్తూరి స్వామి, వేముల శ్రీనివాస్, సమ్మయ్య, జడ్సన్ చిట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా 20 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. కాజీపేట మీదుగా చర్లపల్లి–డెహ్రాడూన్–చర్లపల్లి, బిలాస్‌పూర్–కాచిగూడ–బిలాస్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నామని, దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 22 నుంచి మే 27వ తేదీ వరకు ప్రతీ మంగళవారం చర్లపల్లి–డెహ్రాడూన్ (07077) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 24 నుంచి మే 29వ తేదీ వరకు ప్రతీ గురువారం డెహ్రాడూన్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, రాణి కమలపతి, బీనా, ఝాన్సీ, ఆగ్రా, మతుహర, హజ్రత్‌నిజాముద్దీన్, మీరట్, రూర్కి, హరిద్వార్‌లో హాల్టింగ్ కల్పించారు. మే 12వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ప్రతీ సోమవారం బిలాస్‌పూర్–కాచిగూడ (08263) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు మంగళవారం చేరుకుని వెళ్తుంది. తిరుగుప్రయాణంలో మే 13వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు ప్రతీ మంగళవారం కాచిగూడ–బిలాస్‌పూర్(08264) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు భాటపర, రాయ్‌పూర్, దుర్గ్, రాజ్‌నందిగాన్, డోంగర్‌ఘర్, గోండ్లవాడ, బాల్హార్షా, సిర్పూకాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, కాజీపేట, చర్లపల్లి, మల్కాజ్‌గిరి స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

కుటుంబ సమస్యలు కుల పెద్దలే పరిష్కరించాలి





మాట్లాడుతున్న హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, శిక్షణకు హాజరైన కమ్యూనిటీ మీడియేటర్లు

- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్
- కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం

వరంగల్ లీగల్ : కుటుంబ సమస్యలు కులపెద్దలే పరిష్కరించాలని, సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి, శాంతియుత సమాజాన్ని స్థాపించడానికి కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవ సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ ఏ వివాదమైనా ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహాల మధ్యే ఏర్పడుతుందని, అయితే ఆ వ్యక్తి గాని సమూహం గాని ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారన్నారు. అలాంటి పరిస్థితిల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దవారు వారికి నచ్చచెబుతే వివాదాలు సద్భావ వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించినదే కమ్యూనిటీ మీడియేషన్ విధానమన్నారు. దేశంలో మొదటిసారి కేరళలో ఈ విధానం విజయవంతమైందని, సమాజంలోని కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేల సంఖ్యలో వివాదాలను పరిష్కరించారన్నారు. కాగా, 2023లో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందన్నారు. ముఖ్యంగా సమాజంలో కొన్నేళ్లుగా భార్యాభర్తలు, తల్లిదండ్రులు, పిల్లల మధ్య తగాదాలు పెరిగిపోతున్నాయని, వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మీడియేషన్ అని తెలిపారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ఇంటిలో సర్ది చెప్పే పెద్దలు లేకపోవడం దంపతుల మధ్య మనస్పర్థలు ఎక్కువ అవ్వడానికి కారణమవుతున్నాయని, వీటిని సమాజ కమ్యూనిటీ పెద్దలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్. పంచాక్షరి మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత ఏప్రిల్ 7న కామారెడ్డిలో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి నిర్మలా గీతాంబ, సి.హెచ్ రమేశ్ బాబు, ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమాదేశ్ పాండే, కమ్యూనిటీ మీడియేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని కలిసిన వరంగల్, హనుమకొండ కలెక్టర్లు

కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్‌ను ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి స్వాగతం పలికారు.

వీడిన మల్లక్క హత్య కేసు మిస్టరీ..

- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఆదివారంపేటలో ఈ నెల 13న జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈమేరకు కాటారం పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగార్జునరావు.. నిందితుడి అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. ఆదివారంపేటకు చెందిన ఒడేటి మల్లక్క(67) భర్త రామయ్య, కుమారుడు రమేశ్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. గ్రామంలో కిరాణం నడుపుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. మల్లక్క కుమారుడు చనిపోగా కోడలు శ్రీలతకు నిందితుడు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బారెగూడకు చెందిన మోరలే శివ అలియాస్ శివాజీతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు మూడేళ్ల పాటు కాగజ్‌నగర్‌లో సహజీవనం చేశారు. శివ వేధింపులు తట్టుకోలేక శ్రీలత అతడిని వదిలిపెట్టి ఆదివారంపేటకు వచ్చి ఉంటోంది. నిందితుడు శివ పలుమార్లు శ్రీలత వద్దకు వచ్చి కలుద్దామని అడగగా ఆమె నిరాకరించింది. దీంతో కక్ష పెంచుకున్న శివ ఆమె అత్తను అంతమొందిస్తే ఆస్తి కోసం శ్రీలత హత్య చేసిందని కేసు ఆమె పైకి వెళ్తుందని ప్రణాళిక రచించాడు. పథకం ప్రకారం ఈ నెల 12న అర్ధరాత్రి మల్లక్క ఇంటికి వెళ్లిన శివ.. నిద్రిస్తున్న మల్లక్క తలపై గొడ్డలితో బాదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మల్లక్క మంచంలోనే మృతి చెందగా నిందితుడు గొడ్డలి అక్కడే పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ రాంచంద్రరావు, ఎస్సై–2 శ్రీనివాస్ ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మృతురాలి కూతురు శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పలు ఆధారాల సాయంతో శివను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు మ్యాక అభినవ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లొస్తానని వెళ్లి.. మృత్యుఒడికి..

పొలం వద్ద విద్యుదాఘాతం.. దడువాయి మృతి

- మరొకరికి తప్పిన ప్రమాదం
- జనగామలో ఘటన



మనీశ్(ఫైల్)

జనగామ : పొలం వద్దకు వెళ్తున్నా.. మళ్లొస్తా అంటూ బయలుదేరిన కొద్ది సేపటికే ఓ దడువాయి మృత్యుఒడికి చేరాడు. విద్యుత్ రూపంలో మృత్యువు కబళించింది. విగతజీవిగా పడి ఉన్న అన్న కొడుకును చూసిన బాబాయి.. అతడిని పట్టుకునే ప్రయత్నంలో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. పట్టణంలోని జ్యోతినగర్ కాలనీకి చెందిన జూకంటి మనీశ్(28) వ్యవసాయ మార్కెట్‌లో దడువాయిగా పని చేస్తున్నాడు. తన సొంత భూమిలో డెయిరీ ఫామ్ నిర్వహించడంతోపాటు (పాల వ్యాపారం) వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పొలం వద్ద పనులతోపాటు పశువుల వ్యర్థాలను తొలగించేందుకు ఇంట్లో చెప్పి తెల్లవారుజామున బయలుదేరాడు. పొలం పనులు చేసిన తర్వాత పశువుల పాకలో వ్యర్థాలను తొలగించే క్రమంలో కరెంట్ తీగ చేతికి తగలంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో బాబాయి జూకంటి శ్రీశైలం పక్కనే ఉన్న తన పొలంలో పని ముగించుకుని ఇంటికి బయలు దేరేందుకు సిద్ధమయ్యాడు. అన్న కుమారుడు మనీశ్ ద్విచక్రవాహనం చూసి ఇంకా ఇంటికి వెళ్లలేదని అతడిని పిలుస్తూ ముందుకు వెళ్లాడు. ఎంతకూ పలకకపోవడంతో దగ్గరకు వెళ్లే సరికి విగతజీవిగా పడి కనిపించాడు. తట్టి లేపే ప్రయత్నంలో కరెంట్ తీగలు గమనించి వెనక్కి తగ్గడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయగా వారు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. బిడ్డా మళ్లొస్తానంటూ వెళ్లి.. కానరానిలో కాలకు వెళ్లిపోయావా అంటూ గుండెలవిసేలా రోదించారు. ఎస్సై రాజేశ్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తల్లిదండ్రులు యాదగిరి, ఉపేంద్ర తీర్థయాత్రలకు వెళ్లగా, కొడుకు చనిపోయిన వార్త తెలుసుకుని అయోధ్య నుంచి జనగామకు బయలు దేరారు.

డిగ్రీ పరీక్షల వాయిదా తప్పదా?

పరీక్ష ఫీజు చెల్లించిన కళాశాలలు 156 మాత్రమే

- విద్యార్థుల నుంచి వసూలు చేసినా వర్సిటీకి చెల్లించని ఎక్కువ శాతం ప్రైవేట్ కళాశాలలు
- ఫీజురీయింబర్స్‌మెంట్‌కు, పరీక్షలకు ముడి
- పరీక్షలకు 2లక్షల మందికి పైగా విద్యార్థుల నిరీక్షణ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బి ఒకేషనల్, బీసీఏ, తదితర కోర్సుల 2,4,,6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని, వీటి తర్వాత వెంటనే 1,3,5 సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించాలని అధికారులు టైంటేబుల్ విడుదల చేసి పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యారు. అయితే ఆయా పరీక్షల నిర్వహణకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సిద్ధంగా లేవు. ప్రభుత్వం మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అందుకే పరీక్షలు నిర్వహించబోమని ఆయా యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు ఇప్పటికే యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం వరకు కూడా యూనివర్సిటీ పరిధిలో ఎక్కువ శాతం ప్రైవేట్ కళాశాలలు పరీక్ష ఫీజులు యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లించలేదు. అయితే ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని యూనివర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. పరీక్షలు సమీపిస్తున్నా హాల్‌టికెట్లు జారీచేయకపోవడంతో విద్యార్థులు అయోమయం చెందుతున్నారు. అన్ని సెమిస్టర్లు కలిపి సుమారు 2లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాయాల్సింటుంది

విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు నేటికీ వర్సిటీకి చెల్లించని వైనం

కేయూ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాలు, పలు అటానమస్ కాలేజీలు కలిపి సుమారు 292 డిగ్రీ కళాశాలలున్నాయి. అందులో శుక్రవారం వరకు అన్ని యాజమాన్యాలు కలిపి 156 కళాశాలలు మాత్రమే ఫీజులు పరీక్షల విభాగానికి చెల్లించాయి. ఇటీవల యూనివర్సిటీ అధికారులు ఫీజులు చెల్లించిన విద్యార్థులకే పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించినా ఆయా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మాత్రం బేఖాతర్ చేస్తున్నాయి. పరీక్షలను ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ముడిపెట్టి విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులను పరీక్షల విభాగానికి చెల్లించకపోవడంతో పరీక్షల నిర్వహణపై యూనివర్సిటీ అధికారులు మల్లగుల్లాలుపడుతున్నారు. ఎందుకంటే ఈనెల 21నుంచే పరీక్షలు నిర్వహించాల్సింటుంది. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచాల్సింటుంది. ఈ ప్రక్రియను చేపట్టే పరిస్థితులు కనపడడం లేదు. అందుకే వాయిదా వైపు మొగ్గుచూపేందుకే అవకాశాలున్నాయి..

ఓయూలో కొనసాగుతున్న పరీక్షలు.. ఎంజీయూలో వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికే డిగ్రీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు కొనసాగుతున్నాయి. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో కూడా ప్రైవేట్ యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు సిద్ధంగా లేకపోవడంతో 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు మాత్రం వాయిదావేశారని సమాచారం. దీంతో కాకతీయ యూనివర్సిటీ కూడా పరీక్షలను వాయిదా వేయక తప్పదని తెలుస్తోంది.

నేడు వాయిదా నిర్ణయం వెల్లడించే అవకాశం

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు సిద్ధంగా లేకపోవడం.. పరీక్షల ఫీజులు చెల్లించకపోవడంతో టైంటేబుల్ ప్రకారం పరీక్షలు ఈనెల 21నుంచి నిర్వహించడం సాధ్యం కాదు. ఈనెల 19న వీసీ కె.ప్రతాప్‌రెడ్డి యూనివర్సిటీకి రానున్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం, పరీక్షల విభాగం అధికారులతో చర్చించి వాయిదా వేసే అవకాశాలున్నాయి.

లైఫ్@360

రోజంతా ఉల్లాసంగానే...



చాలామంది రోజంతా నీరసంగా.. నిస్సత్తువగా గడుపుతుంటారు. దీనివల్ల శరీరం నిస్తేజంగా మారడమే కాకుండా అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిన్నపాటి మార్పుల ద్వారా రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చు. అవేంటో చూద్దాం..



తగినంత నిద్ర.. ప్రతిరోజూ కనీసం 7–8 గంటలు నిద్ర పోవడం చాలా ముఖ్యం. నిద్రలేమి చిరాకు, నీరసానికి దారితీస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం.. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు శరీరానికి శక్తినిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర ఎక్కువగా ఉండే వాటిని తగ్గించడం మంచిది.



వ్యాయామం.. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. శక్తి స్థాయులు పెరుగుతాయి. నడవడం, యోగా, డ్యాన్స్ లేదా ఇష్టమైన ఏదైనా శారీరక శ్రమ చేయవచ్చు.

నీరు తాగడం.. రోజంతా తగినంత నీరు తాగడం చాలా అవసరం. డీహైడ్రేషన్ వల్ల అలసట, చిరాకు కలగవచ్చు.

ధ్యానం, విశ్రాంతి.. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం లేదా రిలాక్సేషన్ టెక్నిక్స్ కోసం కేటాయించండి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.

పాజిటివ్ ఆలోచనలు.. ప్రతికూల ఆలోచనలను తగ్గించుకుని సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి. కృతజ్ఞత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం.

ఇష్టమైన పనులు చేయడం.. ఆనందం కలిగించే హాబీలు లేదా పనుల కోసం సమయం కేటాయించడం మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

సామాజిక సంబంధాలు.. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఇతరులతో మాట్లాడటం, కనెక్ట్ అవ్వడం మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యం.

కొత్త విషయాలు నేర్చుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం లేదా కొత్త విషయాలు తెలుసుకోవడం మీ మనస్సును ఉత్తేజపరుస్తుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

రోజువారీ అలవాట్లు.. ఉదయం లేవగానే సహజమైన సూర్యకాంతిలో గడపడం శరీరపు జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

చిన్న చిన్న విరామాలు.. మీరు ఎక్కువసేపు ఒకే పనిలో ఉంటే, మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. లేచి కొంచెం నడవండి లేదా స్ట్రెచ్ చేయండి.

పనులు ప్లాన్ చేసుకోవడం.. రోజువారీ పనులను ఒక క్రమంలో ప్లాన్ చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, మరింత నియంత్రణలో ఉన్నట్లు అనిపిస్తుంది.

నవ్వండి, నవ్వించండి.. నవ్వడం ఒక గొప్ప ఒత్తిడి నివారిణి, హాయిగా నవ్వుకోడం మానసిక స్థితిని తక్షణం మెరుగుపరుస్తుంది.

ఈ చిట్కాలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా రోజంతా ఉల్లాసంగాఉత్సాహంగా ఉండగలగడం ఎవరికైనా సాధ్యమే.ఒకవేళ మీకు ఏవైనా ప్రత్యేకమైన ఆందోళనలు ఉంటే, వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.



ప్రాణాయామంతో మనస్సు, శరీరం రీఛార్జ్

● యోగా



యోగాలో ప్రాణాయామం ప్రయోజనాలు యోగాకు మించి ఉంటాయి. శ్వాస మీద పని చేస్తున్నప్పుడు, శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగిస్తూనే తగినంత ఆక్సిజన్ సరఫరాతో శ్వాసను నియంత్రించడం, సరైన విధంగా సాధన చేయడం ఈ యోగాలో కీలకం. శరీరాన్ని రీఛార్జ్ చేయడం ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రాణాయామం జీర్ణాశయానికి ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది, మెరుగైన జీర్ణక్రియ కోసం రక్త ప్రవాహాన్ని, ప్రేగుల బలాన్ని పెంచుతుంది. యోగా ఆసనాలతో కలిపి చేసే ప్రాణాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. జీవక్రియ వ్యర్థాలను తొలగిస్తుంది.

సాధన చేయడానికి...

ప్రాణాయామం చేయడానికి, ఒక ప్రశాంతమైన స్థానంలో కూర్చొని, వెన్నును నిటారుగా ఉంచాలి. రెండు కళ్ళను మూసి, శ్వాసను లోపలికి పీల్చుకోవాలి. కొన్ని క్షణాలు ఆ శ్వాసను బిగించి, తర్వాత నెమ్మదిగా బయటకు వదిలేయాలి. ఈ ప్రక్రియను పదే పదే పునరావృతం చేయడం వల్ల శరీరానికి, మనసుకు ప్రశాంతత చేకూరి శక్తిమంతం అవుతాయి. శ్వాస సాధన ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

మెరుగైన ఆరోగ్యానికి మల్బరీ జ్యూస్



తియ్య తియ్యగా... పుల్ల పుల్లగా ఉండే మల్బరీ పండ్లు అన్ని కాలాలలోనూ అందుబాటులో ఉంటాయి. మల్బరీ పండ్లతో చేసిన జ్యూస్ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. అవేమిటో చూద్దాం..

మల్బరీలో ఉండే డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకం, కడుపులో మంటలను తగ్గిస్తుంది.

గుండె ఆరోగ్యానికి మల్బరీ యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉండి రక్తనాళాల పనితీరును మెరుగుపరచి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. తద్వారా స్ట్రోక్స్, గుండెపోటు వంటి సమస్యలను నివారిస్తుంది.

రోగనిరోధక శక్తి పెంపు: మల్బరీలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని వ్యాధులకు వ్యతిరేకంగా శక్తిమంతమైన రక్షణను అందిస్తుంది.

ఎముకల ఆరోగ్యానికి: మల్బరీలోని విటమిన్ కె, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి మంచిది.

కంటి చూపు మెరుగు: మల్బరీ జ్యూస్‌లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది కాబట్టి ఇది తాగడం వల్ల చూపు మెరుగుపడుతుంది. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసే వారికి కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుంది: శస్త్రచికిత్స తర్వాత రోగులకు మల్బరీ జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.

జుట్టు సహజ రంగును నిలుపుకుంటుంది: మల్బరీ జుట్టులో మెలనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు సహజ రంగును నిలుపుకోవడానికి సహాయపడుతుంది, జుట్టు నెరిసిపోవడాన్ని తగ్గిస్తుంది.

మెదడు ఆరోగ్యానికి మంచిది: మల్బరీలో న్యూరోప్రొటెక్టివ్ లక్షణాలను కలిగి ఉన్న వివిధ బయో యాక్టివ్ సమ్మేళనాలు మెదడు కణాలను ఒత్తిడి నుంచి రక్షించి ఐక్యూను మెరుగుపరుస్తాయి. మల్బరీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి, నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చివరగా... ప్రయోజనాలు ఉన్నాయి కదా అని ఈ జ్యూస్‌ని విపరీతంగా తాగ కూడదు. పరిమితి పాటించడం మంచిది.

మండే ఎండల్లోనూ ఆరోగ్యంగా...





ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖచర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్సాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...

- మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.
- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

సాక్షి సినిమా

అప్పనా తనామనా పాట బాగుంది

- సుకుమార్



● సువిక్షిత్, సుకుమార్, గీతిక

''దూరదర్శిని' హీరో సువిక్షిత్ నా రూపం వచ్చేటట్లు వరిపొలంలో ఫార్మింగ్ చేశాడు. అప్పటి నుంచి తనతో నాకు పరిచయం ఉంది. తనకి సినిమా అంటే ప్యాషన్. ఈ మూవీ నుంచి నేను రిలీజ్ చేసిన 'అపనా తనామనా...' పాట చాలా బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. సువిక్షిత్ బొజ్జ, గీతికా రతన్ జంటగా నటించిన చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి. సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మించారు. ఆనంద్ గుర్రాన సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'అపనా తనామనా...' అనే పాట లిరికల్ వీడియోను సుకుమార్ విడుదల చేశారు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. సువిక్షిత్ బొజ్జ మాట్లాడుతూ– ''నా అభిమాన దర్శకుడు సుకుమార్‌గారి చేతుల మీదుగా మా మూవీ సాంగ్ రిలీజ్ కావడం సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా అందర్నీ 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని, ప్రేమకథలను గుర్తుకు తెస్తుంది''అని తెలిపారు.

కథ గమ్మత్తుగా అనిపించింది

- నవీన్ చంద్ర



● రాకేశ్ వర్మ, రాశీ సింగ్, నవీన్ చంద్ర

''బ్లైండ్ స్పాట్' మంచి థ్రిల్లర్ మూవీ. రాకేష్ కథ చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఈ మూవీ స్క్రీన్‌ప్లే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నాకు వైవిధ్యమైన అనుభూతి ఇచ్చింది. కథను నమ్మి ఒక్కొక్క సినిమా చేసుకుంటూ ముందుకు వస్తున్నాను. ఎప్పటిలాగే 'బ్లైండ్ స్పాట్'కి కూడా ప్రేక్షకుల ప్రోత్సాహం ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు నవీన్ చంద్ర. రాకేష్ వర్మ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రాశీ సింగ్ జోడీగా నటించిన చిత్రం 'బ్లైండ్ స్పాట్'. మ్యాంగో మాస్ మీడియా బ్యానర్‌పై రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో **నవీన్ చంద్ర మాట్లాడుతూ–** ''మా సినిమా పోస్టర్లో ఒక క్లూ ఉంది. అది కనిపెట్టి నాకు మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను ఈ చిత్రం చూస్తాను'' అన్నారు. **రాశీ సింగ్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా అంతా నా పాత్ర ఏడుస్తూనే ఉంటుంది. సినిమా బాగా వచ్చింది'' అని చెప్పారు. **రాకేష్ వర్మ మాట్లాడుతూ–** ''మా సినిమా కథ మొత్తం ఒక రాత్రిలో జరుగుతుంది. నవీన్ చంద్ర తన పాత్రలో చాలా లీనమై నటించారు. రాశీ సింగ్ గ్లిజరిన్ లేకుండా కన్నీళ్లు తెచ్చుకునేంత మంచి నటి'' అన్నారు.

వాళ్లు ఐ లవ్ యూ చెప్పలేదు

- కమల్‌హాసన్



● అభిరామి, షణ్ముగమూర్తి, ఏఆర్ రెహమాన్, మణిరత్నం, కమల్‌హాసన్, త్రిష, శింబు

''థగ్ లైఫ్' సినిమాలో శింబు, త్రిష, అభిరామి, జోజు జార్జ్ వంటి నటీనటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. అయితే ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు (త్రిష, అభిరామి) ఉన్నప్పటికీ నాకు ఒక్కసారి కూడా వారు ఐ లవ్ యూ చెప్పలేదు. కానీ, జోజు జార్జ్ మాత్రం రోజూ ఐ లవ్ యూ చెప్పేవారు'' అని కమల్‌హాసన్ సరదాగా పేర్కొన్నారు. కమల్‌హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, జోజు జార్జ్, అభిరామి ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బ్యానర్స్‌పై కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ నుంచి 'జింగుచ్చా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా **కమల్‌హాసన్ మాట్లాడుతూ–** ''నాయగన్' తర్వాత మళ్లీ మణిరత్నంగారి దర్శకత్వంలో నటించడానికి ప్రేక్షకులే కారణం. ఆయనకు, నాకు మధ్య ఇప్పటికీ ఏమీ మారలేదు. 'థగ్ లైఫ్' కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. **మణిరత్నం మాట్లాడుతూ–** ''కమల్‌హాసన్ సినిమా లవర్. డబ్బింగ్ జరుగుతుంటే నా ఆఫీస్‌కు వచ్చిన కమల్‌హాసన్ అమెరికాలో జరుగుతున్న సౌండ్ మిక్సింగ్ గురించి చెప్పారు. ఆయన దర్శకుడికి 50 శాతం భారాన్ని తగ్గిస్తారు'' అన్నారు. **త్రిష మాట్లాడుతూ–** ''మణిరత్నంగారి దర్శకత్వంలో నేను నటించిన మూడవ చిత్రం 'థగ్ లైఫ్'. అదేవిధంగా కమల్‌హాసన్‌గారు, శింబుతోనూ నటించిన మూడో చిత్రం ఇది కావడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''కమల్‌హాసన్‌గారి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను'' అని శింబు తెలిపారు. ఈ వేడుకలో నటీనటులు అభిరామి, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, కెమేరామేన్ రవి కె.చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

– 'సాక్షి' తమిళ సినిమా, చెన్నై



● తమ్మిరాజు, సునీల్ బలుసు, కల్యాణ్‌రామ్, శ్రీకాంత్, అశోక్ వర్ధన్, ప్రదీప్ చిలుకూరి

మా అబ్బాయి మాటలతో షాక్ అయ్యా

- కల్యాణ్ రామ్

''అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మా నందమూరి అభిమానులకు ధన్యవాదాలు. మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది'' అని హీరో కల్యాణ్ రామ్ చెప్పారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో **కల్యాణ్ రామ్ మాట్లాడుతూ–**''మా అబ్బాయి ఈ సినిమా చూసి, 'ఇలాంటి సీక్వెన్స్ ఇండియన్ స్క్రీన్ మీద చూడలేదు... చాలా గర్వంగా ఉంది నాన్న' అని చెప్పాడు. ఆ రియాక్షన్‌కి నేను షాక్‌కి గురయ్యాను''అన్నారు. **నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ–**''ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతోనే మొదలుపెట్టాం. మా నమ్మకం నిజమైంది'' అని చెప్పారు. **ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–** ''ఈ మూవీకి ఆడియన్స్ నుంచి వస్తున్న రియాక్షన్ చూస్తుంటే గూజ్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. **సునీల్ బలుసు మాట్లాడుతూ–** ''చాలా కాలం తర్వాత థియేటర్స్ అన్నీ మళ్లీ మా సినిమాతో ఫుల్ అవుతున్నాయి అని డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కాల్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. సాయంత్రం నుంచే అన్ని చోట్ల షోలు యాడ్ అవుతున్నాయి'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్ ముప్పా, ఎడిటర్ తమ్మిరాజు పాల్గొన్నారు.

మేలో శుభం

హీరోయిన్ సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం' విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్,



● 'శుభం' సినిమా పోస్టర్

శ్రావణి నటించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించారు. ఈ మూవీని మే 9న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ''వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే నా లక్ష్యం. 'శుభం' ఆ కోవలోకి వస్తుంది. ఈ చిత్రం కోసం నా టీమ్ చాలా కష్టపడింది. ఈ కథను అందరితో పంచుకోవడానికి మేం సంతోషిస్తున్నాం''అన్నారు సమంత.

ఓటీటీ | ఇది చూడొచ్చు

చరిత్రలో చెరిగిపోని వీరుడు చావా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం చావా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా అనేది మన జీవిత ప్రతిబింబం. మన జీవితంలో ఎన్నో రకాల భావావేశాలు, వాటికి కారణమైన కథనాలు ఎన్ని ఉంటాయో వాటన్నిటినీ మళ్లీ నాటకీయంగా రూపకల్పన చేసి, నటీనటులను అవే కథనాలలో నటింపజేసి మన జీవితాన్ని మనకే అద్దంలో చూపించే మహా ప్రయత్నమే సినిమా. చిన్నప్పుడు బామ్మ ఒళ్లో చందమామను చూస్తూ చెప్పే కథలు చక్కగా ఎందుకు వింటామో తెలుసా... ఎక్కువగా చరిత్రలోని కథనాలే ఆవిడ మనకి చెప్పారు కాబట్టి. మన చరిత్రలో మన పూర్వీకుల వీరత్వం ఉంది. ఆ వీరత్వం మాటున బోలెడంత పోరాటం ఉంది. ఆ పోరాటం వెనక దాగి ఉన్న పట్టుదలతో కూడిన త్యాగం ఉంది. ఆ త్యాగంలో కనబడని బాధ, కనిపించే ఆనందంలాంటివి ఎన్నో ఉన్నాయి. అటువంటి పోరాటాలను అడపా దడపా నేటి దర్శకులు సినిమాల రూపంలో మన ముందుకు తీసుకువస్తున్నారు. ఆ కోవకు చెందినదే 'చావా' చిత్రం. ఛత్రపతి శివాజీ పేరు చాలా మందికి తెలుసు. కానీ శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ గురించి అందరికీ తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా ఆరంభంలోనే నాటి మొఘలు సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబుకు ఓ వార్త అందుతుంది. భారతదేశం మూలమూలలా కబళించిన మొఘలులు మరాఠాల ప్రాంతంలో మాత్రం అడుగు కూడా పెట్టలేకపోతారు. దానికి కారణం ఛత్రపతి శివాజీ. ఆయన ఇక లేరన్న వార్త ఔరంగజేబుకు అమృతంలా అందుతుంది. వార్త విన్న ఆనందం ఆస్వాదించేలోపే శివాజీ కొడుకు శంభాలా గురించి కూడా ఔరంగజేబుకు తెలుస్తుంది. దాంతో ఔరంగజేబు తన కిరీటాన్ని తీసేసి, శంభాలాను చంపిన తర్వాతే తాను మళ్లీ కిరీటాన్ని పెట్టుకుంటానని ప్రతిన బూనుతాడు. ఆ తర్వాత శంభాలాని ఔరంగజేబు కుట్రతో ఎంత దారుణంగా చంపుతాడనేదే ఈ సినిమా. లక్ష్మణ్ ఉటేకర్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రముఖ వర్ధమాన నటుడు విక్కీ కౌశల్ శంభాలా పాత్రలో ఒదిగిపోయారు. ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా కూడా అద్భుతంగా ఒదిగిపోయారు. అలాగే ఔరంగజేబు పాత్రలో అక్షయ్ ఖన్నా జీవించారు. ఇక సినిమా పరంగా ప్రతి క్షణం ప్రేక్షకుడిని ఉద్వేగపరుస్తూ చివర్లో కన్నీటితో సాగనంపుతారు దర్శకుడు. అయితే ఇది కథాపరంగా మాత్రమే సుమా. గడిచిన పదేళ్లలో 'బాహుబలి'తో ప్రపంచ ఖ్యాతిని మూటగట్టుకున్న మన టాలీవుడ్ గురించే ప్రేక్షకులు మాట్లాడుకుంటున్న ఈ తరుణంలో 'చావా' సినిమా మాత్రం దాదాపుగా అడుగంటిన బాలీవుడ్ ఖ్యాతిని ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ లేపిందనే చెప్పాలి. ఈ సినిమా విడుదలకు ముందు తర్వాత కూడా ఎన్నో సంచలనాలకు దారి తీసిందన్న విషయం మనకు తెలుసు. 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమ్ అవుతున్న ఈ 'చావా' ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా, కాదు కాదు చూసి తెలుసుకోవాల్సిన చరిత్ర. తప్పనిసరిగా చూడాల్సిన చిత్రం.



– హరికృష్ణ ఇంటూరు